మార్చి 8 వరకూ పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పిజిఆర్ఎస్ సెషన్లకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ ఈ సూచనలు చేసిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీ పిజిఆర్ఎస్ నిర్వహించడం లేదని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం పోర్టల్ ద్వారా సమీపంలోని సచివాలయాల్లో అర్జీలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. ఫిబ్రవరి 27న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానం కోసం ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో సోమవారం పిజిఆర్ఎస్ సెషన్‌లు రద్దు చేసినట్టు తెలిపారు.

విద్యార్థులకు కార్పొరేట్ వల

- జిల్లావ్యాప్తంగా అడ్మిషన్ల వేట షురూ
- తల్లిదండ్రులకు ఫోన్స్, ఎస్ఎంఎస్‌ల జోరు
- కళాశాలల్లో ఎన్నో ప్రత్యేకతలంటూ ప్రచారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు వల వేస్తున్నాయి. గత నెల నుంచే ఎల్‌కెజి, నర్సరీ తరగతులకు అడ్మిషన్ల కోసం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌లకు లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో టీచర్లు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల కోసం వెంట పడుతున్నారు. జూనియర్ కళాశాలల ప్రతినిధులు ఏకంగా గ్రామాల్లో మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల నెంబర్లు సేకరించి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు చేస్తూ ఊదరగొడుతున్నారు. ఎలాగోలా బుట్టలో వేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గతంలో పదో తరగతి ఫలితాల అనంతరం అడ్మిషన్ల కోసం కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు తమ సిబ్బందికి లక్ష్యాలు విధించి అడ్మిషన్లు సేకరించడం పరిపాటి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు రిజర్వ్ చేసుకుంటే రాయితీలిస్తామని చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి.

వివరాలు మొత్తం సేకరించి..

తూర్పు గోదావరి జిల్లాలో 123 ఇంటర్ జూనియర్ కాలేజీలు, వీటిలో 78 ప్రయివేటు కార్పొరేట్, 45 ప్రభుత్వ, వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. రెండేళ్లుగా జూనియర్ ప్రభుత్వ కాలేజీలలో ఫలితాలు తలకిందులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులు యోచిస్తున్నారు.. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇంటింటా ఫోన్, ఎస్ఎంఎస్‌ల ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతో పాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామంటూ ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు.. ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళుతున్నారు. తమ కళాశాలలో చేర్పిస్తే ఫీజు రాయితీ ఇస్తామని, సౌకర్యాలు కల్పిస్తామని, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు.

ఎవరి డప్పు వారిది..

రాజమహేంద్రవరం, కాకినాడలతో పాటు విజయవాడ, విశాఖపట్నం విద్యాసంస్థలు ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తమ సంస్థలు ఉన్నాయని, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందని, చేరాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలు కూడా విద్యార్థులపై వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, ఎఐఇఇఇ, జెఇఇ మెయిన్స్, ఎన్ఐటి శిక్షణ ఇస్తామని, పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నారు. కళాశాలలో ఎసి, నాన్ ఎసి, డేస్కాలర్, హాస్టల్, మెస్ తదితర ప్రత్యేకతలు ఏకరువు పెడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. వెంటనే డబ్బు చెల్లించి, సీటు ఖరారు చేసుకోవాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. మెరుగైన మార్కులు సాధించిన వారికి ప్రత్యేక రాయితీలు అంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల మాయమాటలు నమ్మి, కొందరు పిల్లలను చేర్పించేస్తున్నారు. మరికొందరు కళాశాల చూసిన తరువాత చెబుతామని బదులు ఇస్తున్నారు. ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామని సంస్థలు చెబుతున్నాయి. ఆయా కళాశాలలు ఫీజులు కూడా రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్రంలో అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి తీసుకున్న నిర్ణయంతో అర్హులైన పేదలకు లబ్ధి చేకూరనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సులువుగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం దక్కిందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సిసిఎల్ఎ ఛీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి తెలిపారని, అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సూచనలు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జిఒ నెంబర్ 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్-2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతామని, ఈ సంవత్సరం 2025 డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. క్రమబద్ధీకరణకు మేరకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ పూర్తి వివరాలను నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలతో మీసేవ ద్వారా అప్ లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. 2019 అక్టోబరు 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలలో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి సిసిఎల్ఎ అధికారులు అత్యంత వేగంగా, ప్రామాణికమైన దరఖాస్తు విధానాన్ని మీసేవ ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చారని తెలిపారు.

150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదు. దారిద్రరేఖకు దిగువను ఉండి 151 నుంచి 300 గజాల లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలి. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 300 నుండి 450 గజాల పరిధిలో బిపిఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి, ఇదే విభాగంలో దారిద్రరేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుంది. 450 గజాలకు మించిన ఆక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. అందుకు సిద్ధంగా లేకుంటే ప్రభుత్వం భూమి స్వాధీనం చేసుకుంటుంది. లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయబోరన్నారు. లబ్ధిదారులు, కుటుంబసభ్యులు ఐటి చెల్లింపుదారై ఉండకూడదని, నాలుగు చక్రాలు వాహనం ఉండకూడదని స్పష్టం చేశారు. గరిష్ఠంగా గ్రామాల్లో నెలకు రూ.10,000, పట్టణాల్లో నెలకు రూ.14,000 ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులుగా నిర్ణయించగా, నెలకు రూ.300 లోపు విద్యుత్తు ఛార్జీల చెల్లింపు ఉండాలన్నారు. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించకూడదు. ఆర్‌సిసి రూఫ్/ఆస్‌బెస్టాస్ రూఫ్‌తో ఇటుక గోడలతో నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇప్పటికే స్వీకరించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటామని, జిల్లావ్యాప్తంగా తహశీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలు పరిశీలిస్తారన్నారు.

గామన్ వంతెనపై లారీ దగ్ధం

ప్రజాశక్తి-తాళ్లపూడి

గోదావరి నదిపై గల గామన్ బ్రిడ్జిపై ఆదివారం ఒక లారీ దగ్ధమయ్యింది. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ నుంచి కాకినాడ పోర్టుకు పలుగురాళ్ల లోడుతో వెళుతున్న లారీ దగ్ధమవడంతో బ్రిడ్జిపై చాలా దూరం పొగ అలముకుంది. లారీ వెనకాల వస్తున్న వాహనదారులు లారీ వెనకవైపు మంటలు వస్తున్నాయని తెలిపారని లారీ డ్రైవర్ ఎల్.శ్రీశైలం తెలిపారు. మంటల నుంచి భారీ శబ్దాలు వెలువడడంతో లారీలో గల సరుకు ఏమిటో అర్థం కాక వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న కొవ్వూరు, రాజమండ్రి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనతో పొగలు కమ్ముకోవడమే కాక బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

గామన్ వంతెనపై దగ్ధమైన లారీ

పలువురికి వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్థానిక సుంకవల్లి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన శ్రీ సితార హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో హాస్పిటల్ డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర, ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, నిమ్మగడ్డ అచ్యుత రామయ్య రోగులకు పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

నరసింహ స్వామికి వెండి వస్తువుల వితరణ

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి పలువురు సోమవారం వెండి పూజా సామగ్రిని అందజేశారు. గోకవరం గ్రామానికి చెందిన రైతు విజయబాబు, అఖిల దంపతులు 594 గ్రాముల వెండి వస్తువులను స్వామి వారికి కానుకగా అందజేశారు. కోరుకొండకు చెందిన పెదపాటి ధర్మరాజు 150 గ్రాముల వెండి కవచాన్ని కానుకగా అందజేశారు. బిక్కవోలు మండలం కొమరిపాలెంకు చెందిన బొండాడ లక్ష్మణరావు 89 గ్రాముల వెండి పూజా సామగ్రిని కానుకగా దేవస్థానానికి అందజేశారు. వెండి వస్తువులను కానుకగా ఇచ్చిన దాతలకు ప్రసాదాలు అందజేశారు. కానుక రూపంగా వచ్చిన వెండి పూజా సామాగ్రిని యాత్రికుల కోరిక మేరకు నిత్య కైంకర్యంలో వినియోగించే నిమిత్తం ఆలయ అర్చకులకు అందజేసినట్టు ఆలయ ఇన్‌ఛార్జి రామ్‌జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి చంటిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళమెత్తుతా

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, కాకినాడ, తాళ్లరేవు

తాను శాసన మండలిలో అడుగు పెట్టిన తర్వాత నిరంతరం ప్రజా సమస్యలపైనే గళమెత్తుతానని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన తనకు అనేక సంఘాలు మద్దతు పలుకుతున్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో పాటు ప్రజా, కార్మిక సంఘాలు మద్దతుతో పోటీ చేస్తున్నానన్నారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, ఉద్యోగ ఉద్యమాల్లో పాల్గొన్న అనుభవం తనకు ఉందన్నారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలుగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసనమండలిలో గళం విప్పుతున్నారన్నారు. విలువలకు కట్టుబడి పని చేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలతో పాటు నిరంతరం నిరుద్యోగుల ఉపాధి సమస్యలపై చేస్తున్న పోరాటాలను ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల ఆశలు ఆవిరి అవుతున్నాయని విమర్శించారు. డిఎస్‌సిని ప్రకటించినప్పటికీ గత 8 నెలలుగా కాలయాపన చేయడం దారుణమన్నారు. 117 జీవోను రద్దు చేస్తామని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అంగన్‌వాడీలు గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు సమ్మె చేశారని, ఆ సందర్భంగా ప్రభుత్వ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని చేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలపై గళం విప్పుతానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన రెండు లక్షల 40 వేల మంది వాలంటీర్లను విధుల్లోకి తీసుకుని ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీటిపై మండలిలో కూడా తాను ప్రశ్నిస్తానన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు పిడిఎఫ్ ఎంఎల్‌సిలను గెలిపించుకోవాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిఒ వలన 3,4,5 తరగతులు విలీనం చేయడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి ఈ జిఒను రద్దు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన వారిని ఎన్నుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.చక్రవర్తి, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ పాల్గొని మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ నాగేశ్వరరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

శాసన మండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగిన వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులును సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 సంవత్సరాల శాసనమండలి చరిత్రలో ప్రజా సమస్యల పరిష్కారంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం కృషి చేశారన్నారు. అదేబాటలో దిడ్ల వీరరాఘవులు పని చేస్తారన్నారు. అభ్యర్థి డివి.రాఘవులు మాట్లాడుతూ తాను గెలిస్తే, శాసనమండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, 'ప్రశ్నించే గొంతికగా' ఉంటానని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరిబాబు, నగేష్, రాష్ట్ర కార్యదర్శులు చక్రవర్తి, జ్యోతిబసు, యుటిఎఫ్ నాయకులు సాయిరాం, సీతారామయ్య, గోవిందరాజులు, ఐ.ప్రసాదరావు, గణేశ్వరావు, పివివి. సత్యనారాయణ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు, ప్రజా సంఘాల నాయకులు వీరబాబు, రాజా, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు ప్రచారం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులు ఆదివారం తాళ్లరేవు మండలంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పి మాజీ చైర్మన్ దున్నా జనార్దన్‌రావు, వైసిపి జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైసిపి మండల అధ్యక్షులు కాద గోవింద్‌కుమార్ తదితరులను కలిసి ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న తనకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులను ఆయన కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కెఎస్.శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, పి.గోపాలకృష్ణ, సంతోష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులుకే మద్దతు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులుకే వేసి గెలిపించుకుందామని ఎపి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ ఎవి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కచేరిపేటలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 2 ద్వారా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటిఎస్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఇప్పటివరకు పని చేస్తున్న ఉద్యోగులందరికి తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ప్రతినెల ఒక శాతం కమిషన్‌తో వేతనాలు, సర్వీసు అందించే ఆప్కాస్‌ని రద్దుచేసి, 4 శాతం కమిషన్ తీసుకునే రాబందులు లాంటి కాంట్రాక్టర్ల చేతికి 1 లక్షా 20 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తుని అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పభుత్వ తాయిలాలకు లొంగకుండా ఉద్యోగులు, కార్మికుల పక్షాన పోరాడుతూ, గళమెత్తే పిడిఎఫ్ అభ్యర్థి డివి. రాఘవులును గెలిపించడం ద్వారా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, 108 ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు గుబ్బల రమణ, 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, సమగ్ర శిక్షా ఉద్యోగుల జెఎసి నాయకులు ఐఇఆర్‌టి. దుర్గాప్రసాద్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



'తిరుమల'లో సదస్సుకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పాయకరావుపేటలోని తిరుమల విద్యాసంస్థల ఆవరణలో 5, 6, 7, 8, 9, 10వ తరగతులు పూర్తిచేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు సుమారు 5 వేల మంది హాజరైనట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజినీరింగ్ (జెఇఇ మెయిన్స్, అండ్ అడ్వాన్స్) నీట్ పరీక్షలలో ఎంతో కాంపిటీషన్ ఉందని, ఆ ఒత్తిడిని తట్టుకుని మన పిల్లలు నిలవాలంటే తల్లిదండ్రుల అందరి ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు వారి బిడ్డల భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, మానసికంగానే కాక శారీరకంగా కూడా దఢంగా ఉండేలాగ వారిని సన్నద్ధం చేయాలని, అప్పుడే వారు వృద్ధిలోకి వస్తారని తెలిపారు. జాతీయ స్థాయి పరీక్షలైన జెఇఇ (మెయిన్స్), జెఇఇ (అడ్వాన్స్) నీట్‌లలో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కే ఎక్కువగా అలవాటు పడ్డారని, వారికి పుస్తకాలతో కన్నా మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి తల్లిదండ్రులు వివరించాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యా సంస్థల అధినేత తిరుమలరావు

తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లలు తమ తల్లిదండ్రులను అనుకరిస్తారని, తల్లిదండ్రులే వారికి రోల్‌మోడల్‌గా ఉండాలని సూచించారు. ఈ సదస్సులో విద్యాసంస్థల ప్రిన్సిపల్ వి.శ్రీహరి, పాయకరావుపేట కాలేజ్ ప్రిన్సిపల్ కె.విజయ్ కుమార్, పాయకరావుపేట స్కూల్ ఇన్‌ఛార్జి ఎం.సునీతపాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ'ను వీక్షించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి పది తరగతుల పిల్లలకు పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లు చెయ్యాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు హెచ్ఎంలకు సూచించారు. పరీక్షలపై భయాన్ని తొలగించి, సానుకూల దక్పథాన్ని కల్పించే 'పరీక్షా పే చర్చ' ఒక బృహత్తర కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమంలో సుమారుగా 79 వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రిజిస్టర్ అయ్యి మన జిల్లా ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ప్రతి పాఠశాలలో, ప్రతి తరగతిలో ముందుగానే ఐఎఫ్‌బిలు, స్మార్ట్ టివిలు, కంప్యూటర్లు ఏవి వీలైతే వాటిని ఉపయోగించుకుని అందరు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులూ పాల్గొనేలా చేయాలని కోరారు. కార్యక్రమం ముగిసిన వెంటనే రెండు, మూడు ఫోటోలు, మొత్తం పాల్గొన్న వారి సంఖ్య ఎస్‌సిఇఆర్‌టి, ఎన్‌సిఇఆర్‌టి ద్వారా ఇచ్చిన లింక్‌లలో అప్‌లోడ్ చేయాల్సిందిగా ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం, ఉండ్రాజవరం

జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా మండలంలో గోకవరం, కొత్తపల్లి పిహెచ్‌సిల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు మందుల పంపిణీ చేసినట్టు వైద్యులు డాక్టర్ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరం మండలంలోని 14,658 మంది లబ్ధిదారులకు ఈ మాత్రలు పంపిణీ చేసినట్టు తెలిపారు. హాస్టల్‌లోని విద్యార్థులకు హ్యాండ్ వాష్ ఆవశ్యకత తెలిపి మాత్రలు వేసుకోడానికి ముందు అందరూ చేతులు పరిశుభ్రం గా కడుగుకోవాలని తెలిపారు.

ఉండ్రాజవరం మండలంలోని పిహెచ్‌సిల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరికీ సోమవారం ఆల్బెండజోల్ టాబ్లెట్స్ అందజేస్తామని వైద్యాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పిల్లలు, విద్యార్థులకు స్థానిక ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆయా కేంద్రాల్లోని అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో పంపిణీ చేస్తారని తెలిపారు. ఎంఇఒలు, ఐసిడిఎస్ సిడిపిఒల సహకారంతో మాత్రలు మింగించే ఏర్పాటు చేసినట్టు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని తమ పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు తప్పకుండా తీసుకునేలా సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

గోకవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సునీల్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జాతీయ రహదారి 216 పై అన్నంపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికుల సమాచారం మేరకు యానాం నుంచి పల్లంకుర్రుకు మోటార్ సైకిల్ పై వెళుతున్న ముగ్గురు యువకులు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను తప్పించబోయి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పల్లంకురు శివారు ఐచెరువుకు చెందిన బూల చింటూ(20) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ లో అమలాపురంలో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లప్రోలు అరుంధతి పేటకు చెందిన గంపల జెంబు(40) ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్థానిక డంపింగ్ యార్డ్ వద్ద ద్విచక్రవాహనంపై వస్తూ ప్రమాదవశాత్తు పడిపోయాడు. అతనిని 108 అంబులెన్స్‌లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. 4 రోజుల అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడలో ఓ ప్రయివేటు ఆసుపత్రికి కుటుంబీకులు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. మృతిని మేనమామ గంపల వీర నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని సుధా కాలనీలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.52,210 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక దర్గా సెంటర్‌లో ఆదివారం రాత్రి ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బస్సును ఆపడంతో ప్రమాదం తప్పింది. బస్సులోని ప్రయాణికులు అందరూ క్షేమంగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో పిఎం ఆవాస్ యోజన పథకం ద్వారా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆదివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు విడతలకు సంబంధించి సుమారు 62 మంది లబ్ధిదారులకు రూ.58.80 లక్షలను ఇవ్వడం జరిగిందన్నారు. ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఒరిజినల్ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి స్లం క్లియరెన్స్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను తొలగించండి

ప్రజాశక్తి - తుని

గ్రామాల్లో బెల్ట్ షాపులను తొలగించాలని కోటనందూరు మండల వైసిపి కన్వీనర్ చింతకాయల చినబాబు ఆదివారం ఎక్సైజ్ ఎస్ ఎంఎస్ఎస్.శాస్త్రికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటనందూరు, తుని రూరల్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి ఎంఆర్‌పి ధర కన్నా అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారని, జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలపారు. తక్షణమే వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు నలుగురి ఎంపిక

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ బాక్సింగ్ ఉమెన్ ఎంపికలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 10 మంది బాక్సర్లు పాల్గొన్నారు. 48 కేజీల విభాగంలో కె.అక్షయ(తుని), 51 కేజీల విభాగంలో ఎం.రాజరాజేశ్వరి(చిత్రాడ), 54 కేజీల విభాగంలో ఆర్‌జిఎన్.గంగాభవాని(తుని), 80 కేజీల విభాగంలో ఓపెన్ వెయిట్ కేటగిరిలో జె.ఐశ్వర్య సూర్య దీపిక (పిఠాపురం) ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈనెల 11, 12 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాయుడు శ్రీను, జిల్లా రగ్బి అసోసియేషన్ సభ్యులు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, జి.శివప్రసాద్ పాల్గొన్నారు.

తలుపులమ్మ ఆదాయం రూ.3,70,071

ప్రజాశక్తి - తుని

లోవ కొత్తూరులోని తలుపులమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం ఒక్కరోజు రూ.3,70,071 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెనుముచ్చి విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదం విక్రయం ద్వారా రూ.1,36,095, పూజా టిక్కెట్లు ద్వారా రూ.96,740, కేశకండన ద్వారా రూ.9,720, వాహన పూజలు ద్వారా రూ.7,300, కాటేజీలు ద్వారా రూ.51,016, ఇతర మిసిలేనియస్ డొనేషన్లు ద్వారా రూ.69,200లు మొత్తం రూ.3,70,071 ఆదాయం వచ్చిందన్నారు.

భూముల క్రమబద్ధీకరణకు సిద్ధం

ప్రజాశక్తితో జెసి రాహుల్ మీనా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించేందుకు రంగం సిద్ధం చేశామని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం వేగంగా, ప్రామాణికమైన విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి మరో కీలక ముందడుగు ఈ సందర్భంగా పడిందన్నారు.

ఎలా దరఖాస్తు చేసుకోవచ్చు..

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతోమంది నిరు పేదలకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈజీగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఈ సందర్భంగా అవకాశం దక్కింది. ఈ పథకానికి సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి వచ్చింది. జిఒ నెంబర్ 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ 2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతారు. ఈ సంవత్సరం డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తాము.

యాజమాన్య హక్కులు ఎప్పటికి వస్తాయి.

క్రమబద్ధీకరణకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ అవుతాయి. పూర్తి వివరాలను నిర్ధశించిన దవీకరణ పత్రాలతో మీసేవ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 2019 అక్టోబరు 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలలో ఉన్న భూములను నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సిసిఎల్ఎ అధికారులు అత్యంత వేగంగా, ప్రామాణికమైన దరఖాస్తు విధానాన్ని మీసేవ ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చారు.

దీనికి గల నిబంధనలు ఏమిటి

150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తాము.రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాల్లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలి. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 300 నుండి 450 గజాల పరిధిలో బిపిఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. ఇదే విభాగంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుంది. 450 గజాలకు మించిన అక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవలసి ఉంటుంది. అందుకు సిద్ధంగా లేకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

ఏయే స్థలాలకు క్రమబద్ధీకరణ చేస్తారు

లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయరు. లబ్ధిదారులు, కుటుంబసభ్యులు ఐటి చెల్లింపుదారై ఉండకూడదు. నాలుగు చక్రాలు వాహనం ఉండకూడదు. గరిష్టంగా గ్రామాల్లో నెలకు రూ. 10 వేలు, పట్టణాల్లో నెలకు రూ.14 వేల ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులుగా నిర్ణయించారు. నెలకు రూ.300 లోపు విద్యుత్తు ఛార్జీల చెల్లింపు ఉండాలి. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించకూడదు. ఆర్‌సిసి రూఫ్/ఆస్‌బెస్టాస్ రూఫ్‌తో ఇటుక గోడలతో నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటాం.

జాబితాలను ఎలా ప్రదర్శిస్తారు..

ఇప్పటికే స్వీకరించి, పెండింగులో ఉన్న దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటాం. రాష్ట్రవ్యాప్తంగా తహశీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలు పరిశీస్తారు. అనంతరం అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితాను గ్రామ,వార్డు కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు.

అభ్యంతరాలు స్వీకరించి తహశీల్దార్లు తుది జాబితాను సబ్‌కలెక్టర్, ఆర్‌డీఒకు పంపిస్తారు. సబ్ డివిజన్ లెవెల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టర్‌కు 30 రోజుల్లోగా అప్పీలు చేసుకోవచ్చు. అర్హుల జాబితా ఖరారైన తర్వాత ఆ వివరాలను తహశీల్దార్లు ఆ ప్రాంత సబ్-రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

సంరక్షకుడే..భక్షకుడు...

రూ.3 లక్షల సొమ్ము స్వాహా న్యాయం చేయాలంటున్న అనాథ పిల్లలు

ప్రజాశక్తి - కరప

అనాథ పిల్లలకు సంరక్షుడిగా ఉన్న వ్యక్తే నేడు భక్షకుడిగా మారాడు. బ్యాంకు ఖాతాల్లో వారి పేరుపై ఉన్న సొమ్మును స్వాహా చేసి వారికి తీరని అన్యాయం చేశాడు. విషయం తెలిసిన అనాథ పిల్లలు తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

మండలంలోని గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన తోట నాగేశ్వరరావు, తల్లి లోవలక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు. వీరిలో ఒకరు చక్రమ్మ కాగా, మరో అమ్మాయి లక్ష్మి ఉన్నారు. అయితే 2015లో తోట నాగేశ్వరరావు అనారోగ్యం తో మృతి చెందాడు. ఇంటి యజమాని మృతి చెందడంతో అప్పటికే రక్తహీనతతో బాధపడుతున్న లోవలక్ష్మి ఆ ఇద్దరు పిల్లలతో పాటు, వయోభారంతో ఉన్న లోవలక్ష్మి మేనమామ నర్సింహ మూర్తితో కలిసి అదే గ్రామంలోని అనాథ ఆశ్రమం లో జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 2017లో లోవలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు మేనమామతో కలిసి ఆశ్రమంలోనే ఉండేవారు. చిన్నతనంలోనే తల్లి చని పోవడంతో చంద్రన్న బీమా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.95 లక్షలను వారికి విడుదల చేసింది. ఈ సొమ్ము

బాధితులు చక్రమ్మ, లక్ష్మి

విడుదల కావాలంటే బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి అయింది. ఈ సమాచారం తెలుసుకున్న గొడ్డటిపాలెంకు చెందిన రాజకీయ పార్టీ నాయకుడు వీరంరెడ్డి ముత్యాలరావు వయోభారంతో ఉన్న నర్సింహమూర్తిని సంప్రదించాడు. పిల్లల పేరు మీద బ్యాంకులో వేయాలని ఆ వృద్ధుడిని నమ్మించాడు. అదేతో మీరే చేయండి ఆ వృద్ధుడు చెప్పాడు. దీంతో అతను చక్రమ్మ పేరు మీద కరప మండలం అరట్లకట్ల గ్రామంలోని కార్పొరేషన్ బ్యాంకులో పిల్లల సంరక్షకుడిగా ఖాతాను తెరిపించారు. చంద్రన్న బీమా సొమ్మును చక్రమ్మ ఖాతాలో జమ చేశారు. బాలికల సంరక్షకుడుగా బ్యాంకు ఖాతాలో తన పేరు నమోదు చేయించుకున్న ముత్యాలరావు బ్యాంకు అకౌంట్ పుస్తకాన్ని, చెక్ బుక్ తన వద్దే పెట్టుకున్నాడు. కోవిడ్ సమయంలో బాలికల మేనమామ నర్సింహమూర్తి మృతి చెందాడు. దీంతో ఆ బాలికలు ఇద్దరు పూర్తిగా అనాథల య్యారు. ఆ ఇద్దరు అనాథల బాగోగులను తానే చూసుకుం టున్నట్లు గ్రామంలో చెప్పు కుంటూ తిరిగాడు. పిల్లల భవిష్యత్తు కోసం మేనమామ నర్సింహమూర్తి ఒక వ్యక్తి వద్ద దాచిన రూ.50 వేలను సైతం ముత్యాలరావు చేజిక్కించు కున్నాడు. అనంతరం దఫదఫాలుగా చక్రమ్మ స్కూల్లో ఉన్న సమయంలో చెక్కుల మీద సంతకాలు పెట్టించుకుని ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మును దోచుకున్నాడు. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకంలో వచ్చిన సొమ్మును ముత్యాలరావు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ చేయించుకున్నాడని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన చెల్లెలు పుట్టినరోజుకు కేక్ కొనడానికని ముత్యాలరావు ఇంటికి వెళ్ళి రూ.500 అడిగితే డబ్బు ఇవ్వకపోగా అతను అతని కుటుంబ సభ్యులు దుర్భాషలాడి పంపించారని మీడియా ముందు చక్రమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. బ్యాంకుకు వెళ్లి డబ్బులు తీసకుందామనుకుంటే బ్యాంకు ఖాతాలో డబ్బులు లేవని అధికారులు చెప్పారని, ఆఖరికి గొడ్డటిపాలెంలో చిన్న ఇంటిని కూడా ముత్యాలరావు ఎవరికో అద్దెకు ఇచ్చి ఆ డబ్బులు కూడా తమకు ఇవ్వడం లేదని ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. సంరక్షుకుడిగా ఉంటూ అనాథ బాలికలకు తీరని అన్యాయం చేసిన ముత్యాలరావుపై స్థానిక ఎంఎల్ఎ పంతం నానాజీ, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

నాయకర్‌కు నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

విద్యాభివృద్ధికి కృషి చేసిన నాయకర్

ప్రజాశక్తి - కాకినాడ

విద్యాభివృద్ధికి ఎంఎస్ఎన్ చారిటీస్ వ్యవస్థాపకులు మల్లాడి సత్యలింగం నాయకర్ ఎంతగానో కృషి చేశారని ఎంఎస్ఎన్ చారిటీస్ వంశ పారంపర్య ధర్మకర్త, ఛైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్ అన్నారు. ఆదివారం నాయకర్ 110వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ఫూర్తి ప్రదాత నాయకర్ అని, ఆయన విద్యాభివృద్ధికి తన సర్వస్వాన్ని త్యాగం చేశారని కొనియాడారు. చారిటీస్ సహాయక కమిషనర్, కార్యనిర్వహణాధికారి, కరస్పాండెంట్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. నాయకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ధర్మకర్తల మండలి సభ్యులు పొన్నమండ విజయకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయకుమారి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ క్రీడాంశాలు, వివిధ పోటిలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంప్రదాయ నాట్యాలు, జానపద ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

ప్రజలకు నమస్కరిస్తున్న ముద్రగడ పద్మనాభం

గ్రామాల్లో ముద్రగడ పర్యటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని గజ్జనపూడి, శరభవరం గ్రామాల్లో మాజీ మంత్రి, వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆదివారం పర్యటించారు. గజ్జనపూడిలో సర్పంచ్ గోనగాల అప్పలరాజు నివాసంలో ఆయన వైసిపి నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేయాలని, తద్వారా తన తనయుడు గిరిబాబును ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు అమరాది కాశి, వైసిపి నాయకులు గౌతు స్వామి, రామిశెట్టి దొరబాబు, గువేరా, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

కళా పరిషత్ నిర్వాహకులు, కళాకారుల సమస్యలను పరిష్కరించాలని భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షులు అడపా సూరిబాబు కోరారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయ కళలు, నాటక ప్రదర్శనలు ఇస్తున్న వివిధ కళాపరిషత్‌ల నిర్వాహకులు, కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల విద్యా శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం హైస్కూలు, కళాశాలల్లో నాటక పరిషత్‌ల నిర్వహణకు అనుమతి లేకుండా పోయిందన్నారు. ఈ నిర్ణక్ష్యం కళాపరిషత్ నిర్వాహకులను, కళాకారులను తీవ్రమైన నిరాశకు, ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఉత్తర్వులను సవరించాలని కోరారు.

బర్డ్ ఫీడర్ తయారీపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పిజి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బర్డ్ ఫీడర్ తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పిఒ ఎల్.దివాకర్‌రావు మాట్లాడుతూ వేసవి సమీపించడం వల్ల పక్షులు నీటికి, తిండి గింజలకు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందన్నారు. విద్యార్థులు నీటిమడుగులను తయారుచేసి పక్షులకు ఇబ్బంది కలగకుండా చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద జంతువులకు, పక్షులకు నీరు అందుబాటులో ఉండేలా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో అతిథులు, యాజమాన్యం ప్రతినిధులు

వెట్టి చాకిరీని నిర్మూలించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

'సమాజంలో ఉన్న వెట్టి చాకిరీని నిర్మూలించాలని ప్రత్తిపాడు కోర్టు ప్యానెల్ అడ్వకేట్ బుగత శివ అన్నారు. ఆదివారం మండలంలోని పెదశంకర్లపూడి పంచాయతీ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో 'వెట్టి చాకిరీ నిర్మూలనపై న్యాయ అవగాహన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరి బానిసత్వానికి చిహ్నమని, నాగరిక సమాజంలో ఇటువంటి పనులు చేస్తే చట్ట ప్రకారం శిక్షలు ఉంటాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అటువంటి వెట్టిచాకిరికి పాల్పడినట్లయితే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని' ఆయన సూచించారు. అందరూ వెట్టి చాకిరి నిర్మూలనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెదశంకర్లపూడి గ్రామస్తులు సురేష్, తిరుపతిరావు, దళే నూకరాజు, నాగేశ్వరరావు, కందుల పద్మనాభం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుగత శివ

శ్రీ ప్రకాష్‌లో ఎన్‌సిసి 'ఎ' సర్టిఫికెట్ అర్హత పరీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో ఆదివారం జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులకు ఎన్‌సిసి 'ఎ' అర్హత సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. కాకినాడ ఆంధ్ర 3వ గర్ల్స్ బెటాలియన్ కల్నల్ హెచ్ఎస్.మాలిక్, వివిధ హోదాల ఆర్మీ ఆఫీసర్స్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ సిహెచ్ విజయ ప్రకాష్ మాట్లాడుతూ ఎన్‌సిసి అంటే క్రమశిక్షణకు, దేశభక్తికి మారుపేరన్నారు. ఈ పరీక్షలో 100 శాతం మంది అర్హత సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

గ్రంథాన్ని తరలిస్తున్న ముజావర్లు

ఘనంగా ఉర్స్ ఉత్సవాలు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మండలంలోని పొన్నాడ గ్రామంలో నిర్వహించిన బషీర్ బిబి 70వ ఉర్స్ ఉత్సవాలు ఆదివారం మూడోరోజు ఘనంగా జరిగాయి. మూలపేట గ్రామానికి చెందిన తాజుద్దీన్ బాబా ఇంటి వద్ద నుంచి గుర్రంపై బషీర్ బిబికి గంధాన్ని తీసుకెళ్లి అందజేశారు. ఈ గందోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. 3 రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో గాన బజానా కార్యక్రమాలు నిర్వహించారు.

కుంభమేళాకు ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ డిపో నుంచి ఆదివారం ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రెండు స్టార్ లైనర్ బస్సులు, ఒక సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సును జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నుంచి బయలుదేరిన బస్సులు భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా కుంభమేళాకు చేరుకుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకర్ రావు, పిఆర్ఒ సిహెచ్.వెంకటరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

50 పడకల హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ 50 పడకలను హాస్పిటల్‌ను పద్మశ్రీ డాక్టర్ సుంకర ఆదినారాయణ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మెరుగైన వైద్యం కోసం ఏర్పాటు చేసిన ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వినియోగించుకోవాలన్నారు. హాస్పిటల్, సుమన్వి హెల్త్ కేర్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ గంగిరెడ్డి సురేష్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ, ఎముకల సంబంధించిన శాస్త్ర చికిత్సలతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఫ్యూచర్స్‌తో ప్రతి పేషెంట్‌ను అబ్జర్వేషన్ చేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.మంజుషా, జి.రాంబాబు, పలువురు ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిబ్బన్‌ను కట్ చేస్తున్న పద్మశ్రీ ఆదినారాయణ

దళిత సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్రంలో దళిత సంక్షేమ పథకాలను అమలు చేయాలని పివి.రావు మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నూకరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చెలికాని భావనరావు సభా సదన్‌లో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం పట్టణ అధ్యక్షులు వేళంగి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రద్దుచేసిన 27 రకాల దళిత సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. విభజించి పాలించే విధానానికి స్వస్తి పలికి, మిగిలిన సామాజిక వర్గాలకు అమలు చేసినట్లుగానే దళితులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బత్తిన శామ్యూల్, సీకోలు శేఖర్, నిలిపే రమణ, నల్లి చినబాబు, కందేల్లి రాజీవ్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు

ప్రింట్ మీడియా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండల ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థాని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా బర్ల లోవరాజు, కార్యదర్శిగా గళ్ళ కృష్ణమోహన్ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సోమేశ్వరరావు, జానకిప్రభాకర్, కొత్తూరు బాబురావు, ప్రగడ రామకృష్ణ, శిగిరెడ్డి రమేష్, గుబ్బల శివశంకర్, రెడ్నం మురళి తదితరులు పాల్గొన్నారు.

In the Court of the 1st Additional Senior Civil Judge at Kakinada
O.S. No. 88/2023

Between:
Pulapakuri Sundar Kumar ...Plaintiff
AND
Kaki Sheela ...Defendant
To:
Kaki Sheela, D/o. Sudhakar, D.No. 1-121, K.Gangavaram, K.Gangavaram Mandal, Dr. B.R. Ambedkar Konaseema District.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారాఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 27-2-2025 సం॥ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
అంగాడ సత్య రాఘవేంద్ర (ASR)
కాస్సే రాజు,మందపాటి వెల్సీ ప్రవీణ్
న్యాయవాదులు,దుగ్గిరాల వారి వీధి,
కాకినాడ, సెల్: 8886888844

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న 8వ రాష్ట్ర స్థాయి యూత్ బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో 2వ రోజు వివిధ జిల్లాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. బాలుర విభాగంలో గుంటూరు - కడప, వైజాగ్- కర్నూల్, చిత్తూర్- గుంటూరు, తూర్పు గోదావరి - ఆనంతరపురం జట్లు, బాలికల విభాగంలో కృష్ణా- ఆనంతరపురం, గుంటూరు - చిత్తూర్, కర్నూల్ - కడప, తూర్పుగోదావరి - పశ్చిమగోదావరి, కృష్ణా - వైజాగ్ జట్లు పోటీల్లో తలపడగా బాలుర విభాగంలో గుంటూరు, వైజాగ్, చిత్తూరు, తూర్పుగోదావరి, బాలిక విభాగంలో కృష్ణా, గుంటూరు, కర్నూలు, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా యువజన అధ్యక్షుడు కోప్పన శివనాథ్, బొజ్జ మాణిక్యాలరావు, ఏలీషా, సతీష్, అర్జున్, దుర్గప్రసాద్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తలపడుతున్న అనంతపురం- తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్లు

బాణసంచా పోటీలో గండేపల్లి పాండు విజేత

ప్రజాశక్తి - పెదపూడి

సూర్యనారాయణస్వామి కళ్యాణ మహోత్సవంలో నిర్వహించిన బాణాసంచా పోటీల్లో గండేపల్లి పాండు జట్టు 23 మార్కుల తేడాతో విజయం సాధించింది. మండలంలోని గొల్లలమామిడాడలో శనివారం రాత్రి సూర్యనారాయణస్వామి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా బాణానంచా పోటీల్లో గండేపల్లి పాండు, జువ్విపాడు ఆనందరావు జట్లు పాల్గొన్నాయి. గండేపల్లి పాండు జట్టు 23 మార్కుల తేడాతో బహుమతిని కైవసం చేసుకుందని న్యాయనిర్ణేత మాజీ జెడ్‌పిటిసి సత్తి భగవాన్‌రెడ్డి ప్రకటించారు. విజేతకు ప్రముఖ వ్యాపారవేత్త ఎస్‌విఎస్ఎన్.రెడ్డి చేతుల మీదుగా 1 కాసు బంగారం బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి శ్రీనురెడ్డి, కొవ్వూరి వీర్రాఘవరెడ్డి, ఉత్సవకమిటీ మేడపాటి అమ్మిరెడ్డి. సత్తినానిరెడ్డి. పప్పు చిన్నారెడ్డి, ద్వారంపూడి బంగారెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, కర్రి భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది

కాకినాడ జిల్లా, తుని మండలం, ఎస్.అన్నవరం గ్రామకాపురస్తులు, చోడిశెట్టి సూర్యారావు గారి కుమార్తెయున్నా, పొలిమేర సత్యనారాయణ గారి భార్య పొలిమేర మంగలక్ష్మీ అను నేను ది. 07-02-2025 సం॥రం తేదిన నా తండ్రి గారి తాలూకు **దస్తావేజు నెం. 8656/1981** రు గల ఒరిజినల్ దస్తావేజును తీసుకుని జెరాక్స్ కాపీ నిమిత్తం జెరాక్స్ సెంటరు వెళ్ళేసరికి మార్గ మధ్యలో సదరు ఒరిజినల్ దస్తావేజు ఎక్కడో పడిపోయినది. సదరు ఒరిజినల్ దస్తావేజు కొరకు చుట్టు ప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల కింది అడ్రస్కు ఇవ్వవలెను.

పొలిమేర మంగలక్ష్మీ,
మామిడాల లవకుమారి, చోడిశెట్టి వాణి,
కాకినాడ జిల్లా, తుని మండలం,
ఎస్.అన్నవరం గ్రామం, సెల్ నెం. 7386723333